ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5  తమిళనాడు TAMILNADU

గురువారం 8 మే 2025



ఆపరేషన్ 'సిందూర్'కు సెల్యూట్

పహల్గాంపై దాడికి ప్రతీకార చర్యగా పాకిస్థాన్‌లోని తీవ్రవాదుల శిబిరాలపై భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో దేశంవైపు కన్నెత్తి చూడాలంటే ఎవరైనా భయపడాల్సిందేనని వారు మీడియాతోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ స్పష్టం చేశారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

● 'మేరా భారత్ మహాన్' ● ప్రముఖుల హర్షం

'భారత్ తాయ్ వాళ్గ'. ఆపరేషన్ సిందూర్ 'ఇది ప్రారంభం మాత్రమే'

- గవర్నర్ ఆర్ఎన్ రవి

తీవ్రవాదుల నిర్మూలన పోరాటంలో భారత సైనికులకు తమిళనాడు అండగా ఉంటుంది. దేశం కోసం సైనికులకు అండగా నిలుస్తుంది.

- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పహల్గాం దాడులకు ప్రతీకారంగా పాకిస్థాన్, కశ్మీర్ తీవ్రవాదుల శిబిరాలు లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో ధైర్యంగా ముందుకు సాగిన భారత త్రివిధ దళాలకు అభినందనలు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న సాహసోపేత చర్యలతో బాధితులకు న్యాయం లభించింది. ఉగ్రవాదుల అణిచివేత, దేశ ప్రజలను కాపాడేందుకు ప్రధాని మోదీ అనుసరిస్తున్న దృఢ సంకల్పం సర్వత్రా అభినందనీయం.

- ఎడప్పాడి పళనిస్వామి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి

యుద్ధం వద్దు. యుద్ధం వల్ల ఇరు దేశాలు తీవ్ర నష్టం చవిచూడాల్సి వస్తుంది.

- వైగో, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి

రాజు ఏ మార్గంలో వెళ్తే.. ప్రజలు ఆ మార్గంలోనే..

- ఇళయరాజా, ప్రముఖ సంగీత దర్శకుడు

భారత ప్రభుత్వానికి, సైన్యానికి నా హృదయపూర్వక అభినందనలు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మన సైన్యం దాడి చేసి ఆ స్థావరాలను ధ్వంస చేసి, వారి సాహసోపేతమైన చర్య ద్వారా భారత కీర్తిని నిలబెట్టారు. అమాయక ప్రజలను సైనికులను కొన్ని సంవత్సరాలుగా దొంగచాటుగా చంపుతున్న పాకిస్థాన్ ఉగ్రవాదులను ఇది ఒక హెచ్చరిక, గుణపాఠం లాంటిది. వారు ఏదైనా ప్రతికార చర్యతో దాడి చేస్తే మళ్లీ వారిని తుదముట్టించడంలో కూడా సైన్యం వెనుకాడబోదు. దేశ ప్రజలతో పాటు యావత్ ప్రపంచం సైన్యానికి మద్దతు తెలియజేస్తోంది. పహల్గాం ఉగ్రవాదులను కూడా శిక్షిస్తే బాధిత కుటుంబాలకు, చనిపోయిన వారి ఆత్మకు ఉపశమనం కలుగుతుంది. పాకిస్థాన్ కాల్పుల్లో మృతి చెందిన పౌరుల ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నా.

- తంగుటూరి రామకృష్ణ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు

అవకాశం లభిస్తే నేనూ యుద్ధానికి వెళ్తా. ప్రధాని మోదీ ఒక వ్యక్తి కాదు. 140 కోట్ల మంది భారతీయులకు శిఖరంగా ఉన్నారు. 'ఆపరేషన్ సిందూర్' అనే పేరుకు కారణం, భర్తను కోల్పోయిన మహిళలు సిందూరం పెట్టుకోవడానికి వీలుండదు. కనుకనే ఆ పేరు పెట్టారు.

- నయినార్ నాగేంద్రన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

దేశ భద్రత కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైనదే. అవసరం కూడా. ఈ సాహసోపేత చర్యలకు సిద్ధమైన కేంద్రప్రభుత్వానికి, త్రివిధ దళాలకు మద్దతుగా నిలుద్దాం.

- అన్బుమణి, పీఎంకే నేత

భారత సైనిక చర్యలకు అభినందనలు. గర్వించదగ్గ భారతదేశం తన సాయుధ దళాలకు సంఘీభావంగా నిలుస్తుంది. పిరికి ఉగ్రవాద చర్యలకు బలమైన దేశం దృఢమైన ప్రతిస్పందన.

- కమల్ హాసన్, ఎంఎన్ఎం అధ్యక్షుడు

'ఇదే భారత సైనికుల ముఖచిత్రం... జైహింద్' (అమరన్ చిత్ర పోస్ట్ పెట్టారు)

- శివకార్తికేయన్ (సినీ నటుడు)

భారత్‌కు మద్దతు... (ఎగిరే తెల్ల పావురం, హృదయం సింబల్, భారత్ జెండా పెట్టారు)

- ఏఆర్ రెహ్మాన్



మాక్‌డ్రిల్‌కు సిద్ధమవుతున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

యుద్ధసన్నద్ధ మాక్‌డ్రిల్

● హార్బర్, కల్పాక్కంలలో భద్రతా విన్యాసాలు



రాష్ట్ర జాతీయ విపత్తుల నిర్వహణ బృందం సభ్యులు

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): పాక్‌తో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా దేశ పౌరుల సన్నద్ధతను పరీక్షించే 'మాక్ డ్రిల్' బుధవారం సాయంత్రం 4.30 గంటల నుంచి మద్రాసు హార్బర్ వద్ద, చెంగల్పట్టు జిల్లాలోని కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం వద్ద పకడ్బందీ ఏర్పాట్ల నడుమ జరిగింది. దేశవ్యాప్తంగా 259 ప్రాంతాల్లో మాక్ డ్రిల్‌ను నిర్వహించాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు రాష్ట్రంలో చెన్నై, కల్పాక్కంలలో బుధవారం సాయంత్రం యుద్ధ సమయాల్లో సామాన్య పౌరులు ఎలా ప్రాణాలు కాపాడుకోవాలన్న చిట్కాలను సీఐఎస్ఎఫ్ భద్రతా దళం సభ్యులు, కేంద్ర భద్రతాదళం అధికారులు, అగ్నిమాపక దళం సభ్యులు, విద్యార్థులు కలిసికట్టుగా మాక్ డ్రిల్ జరిపారు. జాతీయ విపత్తుల నిర్వహణ దళం సభ్యులు ఈ రెండు ప్రాంతాల్లో కృత్రిమ యుద్ధ వాతావరణ పరిస్థితులు కల్పించి, విమానాల సైరన్ మోతలు, అంబులెన్స్‌ల సైరన్లు, అక్కడక్కడా బాంబుల వర్షం కురుస్తున్న ప్రాణ హాని కలిగించని పెద్దశబ్దంతో డమ్మీగా పేలే బాంబులు వేసి మాక్‌డ్రిల్‌ను కళ్లకు కట్టారు. యుద్ధవాతావరణంలో సైనిక వాహనాలు సైరన్ మోగించుకుంటూ వచ్చి పౌరుల ప్రాణాలను కాపాడే పద్ధతులు, తాళ్లపై పైకి వెళ్లటం, ఆ తాళ్లతోనే వేగంగా కిందకు దిగటం వంటి విన్యాసాలు కూడా జరిపారు. ఇదేవిధంగా కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం వద్ద కూడా కృత్రిమంగా యుద్ధ పరిస్థితులను ఆవిష్కరింపజేసి సీఐఎస్ఎఫ్ సభ్యులు, భద్రతా విభాగం అధికారులు, సైనికులు, జాతీయవిపత్తుల నిర్వహణ దళం సభ్యులు సామాన్య పౌరులు తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో ప్రదర్శన పూర్వకంగా తెలియపరిచారు. అదే సమయంలో కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంపై దాడులు జరిగితే పాటించాల్సిన భద్రతా చర్యలను కూడా ముఖాలకు యాంత్రిక మాస్కులు ధరించి మరీ ప్రదర్శించారు. ఇదే రీతిలో పుదుచ్చేరి లాస్‌పేట వద్ద కూడా మాక్ డ్రిల్ జరిపారు. అదేవిధంగా నగరంలోని రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన కూడళ్ల వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు.



అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని తరలించే ఘట్టం



సైరన్ మోగగానే చెవులు మూసుకుని బోర్లాపడుకున్న పౌరులు



మాక్ డ్రిల్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న నగరవాసులు



సెంట్రల్ స్టేషన్‌లో భద్రతా బలగాలు

నేడు ప్లస్ టూ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పరీక్షా ఫలితాలు ఈనెల 8న గురువారం ఉదయం 9 గంటలకు విడుదల కానున్నాయి. స్థానిక కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పరీక్షా ఫలితాలు విడుదల చేయనున్నారు. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 3న ప్రారంభమై 25వ తేది వరకు జరిగాయి. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 7,518 పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు మొత్తం 8,21,057 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 3,78,545 మంది విద్యార్థులు, 4,24,145 మంది విద్యార్థినులు ఉన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలో 3,316 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 30,000 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు మే 9వ తేది విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తొలుత ప్రకటించింది పరీక్షలు ముగిసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా 80 కేంద్రాల్లో నిర్వహించిన మూల్యాంకన పనుల్లో సుమారు 40,000 మంది పీజీ టీచర్లు పాల్గొన్నారు. మూల్యాంకనం ముగిసిన అనంతరం స్థానిక కోట్టూరుపురంలోని డేటా సెంటర్‌లో మార్కుల నమోదు, ఫలితాల జాబితా తయారీపనులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో ఇదివరకే ప్రకటించిన తేదీకి ఒకరోజు ముందుగా (ఈ నెల 8వ తేది) పరీక్షా ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల శాఖ ప్రకటించింది. ఆ ప్రకారం, స్థానిక కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో గురువారం ఉదయం 10 గంటలకు పరీక్షా ఫలితాలు మంత్రి అన్బిల్ మహేష్ విడుదల చేయనున్నారు. అలాగే, http://resultsdigilocker.gov.in, www.tnresults.nic.in అనే వెబ్‌సైట్‌ల ద్వారా విద్యార్థులు పరీక్షా ఫలితాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు అందజేసిన సెల్‌ఫోన్ నెంబర్లకు పరీక్షా ఫలితాలు ఎస్ఎంఎస్ ద్వారా పంపనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, పదవ తరగతి, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు ఈ నెల 19వ తేది విడుదల కానున్నాయి.

మా పాలనలో అందరికీ అన్ని సదుపాయాలు

● సగర్వంగా జీవిస్తున్న ప్రజలు
● సీఎం స్టాలిన్ ప్రకటన



డీఎంకే ప్రభుత్వం నాలుగేళ్లుపూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటైన సభలో ఓ లబ్ధిదారుడికి సహాయాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో యేట అడుగుపెడుతున్న ద్రావిడ తరహా డీఎంకే పాలనలో తమకు ఓటేసినవారే కాకుండా ఓటు వేయనివారు సైతం మెచ్చుకునేలా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని, నాలుగేళ్లపాటు అమలు చేసిన పథకాలు దేశానికే మార్గదర్శకంగా మారాయని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. స్థానిక కోట్టూరుపురం అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం హాలులో బుధవారం ఉదయం ఏర్పాటైన సభలో ఆయన పేదలకు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లకు ముందు తాను సీఎంగా పదవీబాధ్యతలు స్వీకరించినప్పుడు రాష్ట్రం పదేళ్ల అన్నాడీఎంకే అసమర్థ పాలనలో అంధకారంలో కొట్టుమిట్టాడుతుండేదని, అన్నింటికీ మించి కరోనా సంక్షోభ పరిస్థితులు కూడా ఉండేవన్నారు. వాటన్నింటిని అధిగమించి ప్రజలకు వెలుగుబాటను చూపే ప్రభుత్వ పాలనను అందించామన్నారు. ద్రావిడ తరహా పాలనలో ఏం లేవు అనే ప్రశ్నలకు ఎన్నో సమాధానాలు చెప్పగలమన్నారు. రాష్ట్రంలో పేదరికం లేదని, ఆకలి చావులు లేవని, ఆర్థిక సంక్షోభం లేదని, కుల, మత ఘర్షణలు లేవని ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. ద్రావిడ తరహా డీఎంకే పాలన మహిళాభ్యుదయానికే అగ్రతాంబూలం ఇస్తుందని, గృహిణులకు అమలు చేస్తున్న కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకానికి మంచి స్పందన లభించిందన్నారు. వచ్చే యేడాది మరో లక్షమందికిపైగా గృహిణులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న గృహిణులంతా ప్రతినెలా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యే రూ.1000ను 'స్టాలిన్ అన్నయ్య ఇచ్చే కానుక' చెప్పుకుంటున్నారని అన్నారు. ఇదే రీతిలో వెలుగు బాట పయనం ద్వారా లబ్ధిపొందుతున్న మహిళాలంతా ఉచితంగా ప్రయాణించే బస్సులకు 'స్టాలిన్ బస్సు' అని పేరుపెట్టి పిలుస్తున్నారని, ఇలా మహిళా లోకం తనపై చేస్తున్న ప్రశంసలు తనకు మాత్రమే కాకుండా ద్రావిడ తరహా ప్రభుత్వం మొత్తానికి ఇస్తున్న ప్రశంసగా భావించాలన్నారు. మహిళలంతా ప్రస్తుతం ఆత్మగౌరవంతో నగదు పొదుపరులుగా కుటుంబాన్ని సాఫీగా నడుపుకోగలుగుతున్నారని చెప్పారు. ఇదే విధంగా విద్య, వైద్య రంగాలకు కూడా ప్రాధాన్యమిచ్చామని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కరవు భత్యాలు పెంచి, వారికి మునుపటిలా ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే పథకాన్ని మళ్లీ అమల్లోకి తెచ్చామన్నారు. మైనారిటీలకు, ఎస్సీ, ఎస్టీలకు కూడా ఎన్నో పథకాలను అమలు చేశామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గణాంకాలలో డీఎంకే ప్రభుత్వాన్ని మెచ్చుకునేలా కొన్ని ప్రకటనలు చేసిందని చెప్పారు. నాలుగేళ్లలో తమ ప్రభుత్వం అన్నీ చేసిందని తాను గొప్పలు చెప్పుకోవడం లేదని, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని, ఐదో యేటా అడుగుపెడుతున్న సమయంలోనూ మరిన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఇంకా ఎలాంటి పథకాలు కావాలో ప్రజలు ఆదేశిస్తే ఆ పథకాలను అమలు చేయడానికి 'ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్' సిద్ధంగా ఉన్నారని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, తంగం తెన్నరసు, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, శివశంకర్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి
సత్యనారాయణప్రసాద్ కన్నుమూత



సత్యనారాయణప్రసాద్ (ఫైల్ ఫొటో)

ప్యారీస్, మే 7 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి సత్యనారాయణప్రసాద్ (56) గుండెపోటుతో మంగళవారం రాత్రి 11.30 గంటలకు మరణించారు. నాలుగేళ్ల క్రితం 2021 అక్టోబర్‌లో మద్రాస్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా పదవీబాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ ప్రసాద్ 2023 మార్చిలో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టులో ప్రస్తుతం న్యాయమూర్తులుగా పనిచేస్తున్న 63 మందిలో ఆయన 42వ స్థానంలో ఉన్నారు. సత్యనారాయణ ప్రసాద్ పదోన్నతి పొందేముందు, గత 1997 నుంచి 24ఏళ్లుగా న్యాయవాద శిక్షణలో పాల్గొన్నారు. తంజావూరులో జన్మించిన సత్యనారాయణ ప్రసాద్ ఆదిలో హైకోర్టు న్యాయవాదిగా బీఎస్ఎన్ఎల్, చెన్నై పోర్టు ట్రస్ట్, ఇండియన్ బ్యాంక్, దక్షిణ రైల్వే సహా పలు ప్రభుత్వ సంస్థలకు సేవలందించారు. ప్రజల సందర్శనార్థం స్థానిక గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన భౌతికకాయానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేరుగా వెళ్లి పుష్పగుచ్ఛం ఉంచి, అంజలి ఘటించారు. అదేవిధంగా పలువురు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తుల సంఘ నిర్వాహకులు, రాజకీయ నాయకులు, అధికారులు నివాళులర్పించారు.



న్యాయమూర్తి సత్యనారాయణ ప్రసాద్ భౌతికకాయానికి సీఎం స్టాలిన్ నివాళి

సమాచార దర్శిని

ఉపాధి హామీ కూలి రూ.336కు పెంపు

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ఉపాధి హామీ పథకంలో అందిస్తున్న ఒక రోజు కూలి రూ.336కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ.319 అందించేవారు. ఈ క్రమంలో, ఉపాధి హామీ పథకంలో గత ఆరు నెలలుగా కూలి అందించ లేదు. కేంద్రప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి రూ.2,999 ఉపాధి హామీ పథక బకాయిలు విడుదల చేసింది. ఈ క్రమంలో, ఈ పథకంలో అందించే రోజు వారీ కూలి రూ.336కు పెంచుతున్నట్లు, ఈ పెంపు ఏప్రిల్ 1వ తేది నుంచి అమల్లోకి రానున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

టైప్‌రైటింగ్ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఆధ్వర్యంలో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్, అకౌంటింగ్ సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తుంటారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో యూజీ, పీజీ, ఇంటర్మీడియేట్, అడ్వాన్స్ స్థాయిలో తమిళం, ఇంగ్లీషు భాషల్లో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, గత ఫిబ్రవరిలో నిర్వహించిన టైపింగ్, షార్ట్ హ్యాండ్, అకౌంటింగ్ పరీక్షా ఫలితాలు https://dte.tn.gov.in/ అనే వెబ్ సైట్‌లో విడుదల చేసినట్లు సాంకేతిక విద్య డైరెక్టరేట్ పేర్కొంది.

డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల రాక

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): రెండో విడత మెట్రో ప్రాజెక్టులో ఇప్పటివరకు 10 కొత్త మెట్రో రైళ్లు చెన్నైకి చేరుకున్నాయి. ఈ విషయమై చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) అధికారులు మాట్లాడుతూ... రెండో విడతలో మూడు మార్గాల్లో 138 డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు నడపనున్నామన్నారు. వాటిని శ్రీసిటీలో తయారు చేస్తున్నారని తెలిపారు. వాటిలో, డ్రైవర్ రహిత తొలి మెట్రో రైలు పూందమల్లి డిపో - పోరూర్ మధ్య నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైందన్నారు. ఇప్పటివరకు 10 మెట్రో రైళ్లు పూందమల్లి డిపోకు చేరాయన్నారు. రెండవ విడత మెట్రో ప్రాజెక్టులో లైట్ హౌస్ - పూందమల్లి వరకు ఉన్న మార్గంలో, పూందమలి బైపాస్ - పోరూర్ మధ్య వచ్చే డిసెంబరులో మెట్రోరైలు సర్వీసులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

వేళచ్చేరిలో స్విమ్మింగ్ శిక్షణ

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఎస్డీఏటీ స్విమ్మింగ్ పూల్‌లో వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 1వతేదినుంచి స్విమ్మింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.ఈనెల 13నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. 120సెం.మీ పొడవు, ఏడేళ్ల వయసున్న విద్యార్థులు,పెద్దలు శిక్షణలో పాల్గొనవచ్చు. 12రోజులుజరిగే శిక్షణకు రూ.2,360ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫీజులో రాయితీ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు వేళచ్చేరిలోని ఎస్డీఏటీ స్విమ్మింగ్ అకాడమీలో సంప్రదించవచ్చు.

12నుంచి టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ రేంజర్, ఫారెస్ట్ గార్డ్ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 12వ తేది ప్రారంభం కానున్నట్టు కార్యదర్శి గోపాలసుందరరాజ్ పేర్కొన్నారు. గ్రూప్-4 పరీక్షల్లో ఫారెస్ట్ రేంజర్, ఫారెస్ట్ గార్డ్ ఖాళీ పోస్టుల (ఎస్టీ యువకులు మాత్రమే) భర్తీకి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 16వ తేది వరకు నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు www.tnpsc.gov.inలో తెలుసుకోవచ్చన్నారు. అలాగే, అభ్యర్థులకు ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా కాల్ లెటర్ పంపించినట్లు ఆయన తెలిపారు.

చెన్నై సెంట్రల్‌లో ఐదు ఆధునిక స్కానర్లు

పెరంబూర్,మే7(ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీ తనిఖీ చేసేందుకు ఐదుఆధునిక స్కానర్లు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.రైళ్లలో గంజాయి, మాదకద్రవ్యాల తరలింపు, సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్ తదితర నేరాలు అడ్డుకోనేలా స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అదే సమయంలో ప్రయాణికుల లగేజీ తనిఖీ చేసేందుకు ప్రస్తుతం ఒక స్కానర్ మాత్రమే ఉందన్నారు. దీంతో తనిఖీ చేసేందుకు సమయం పడుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కారణంగా, స్టేషన్‌లో ఐదు ప్రవేశద్వారాల వద్ద ఆధునిక స్కానర్లు ఏర్పాటు చేయాలని దక్షిణ రైల్వేకు సిఫారసు చేసినట్లు రైల్వే పోలీసు అధికారులు తెలిపారు.

సీఎండీఏ ఆధ్వర్యంలో అప్రెంటిస్ షిప్ శిక్షణ

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) అర్బన్ ప్లానింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, బిల్డింగ్ డిజైన్, సోషల్ వర్క్ వంటి వివిధ విభాగాల్లో రెండు నుంచి ఆరు నెలల వరకు అప్రెంటిస్‌షిప్ శిక్షణ అందిస్తోంది. ఆయా కోర్సుల్లో ప్రస్తుతం చదువుతున్నవారు, కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణా కాలంలో రూ.8,000 నుంచి రూ.15,000 వరకు ప్రోత్సాహక వేతనం అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు ww.cmdachennai.gov.inలో చూడవచ్చు.

హాబిటాట్ బోర్డు...

తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు భవన రూపకల్పన, నిర్మాణ ఇంజనీరింగ్ సహా వివిధ విభాగాల్లో రెండు నుంచి ఆరు నెలల అప్రెంటిస్‌షిప్ శిక్షణ అందిస్తోంది. నెలవారీ ప్రోత్సాహక వేతనంగా రూ.8,000 నుంచి రూ.15,000 అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు www.tnuhdb.tn.gov.inలో సంప్రదించవచ్చు.

మొబైల్ పశు వైద్య వాహనం ప్రారంభం

వేలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలో పశువులకు ఉచిత వైద్య సేవలందించేందుకు బుధవారం మొబైల్ వాహనాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలూరు జిల్లాలో పాడి పశువులపై ఆధారపడి బతుకుతున్నారని తెలిపారు, ఈ మొబైల్ వాహన వైద్యసేవలో తమ పెంపుడు జంతువులకు, పాలు ఇచ్చే పశువులకు వైద్యం చేయించుకోవచ్చన్నారు. గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, పశుసంవర్ధక శాఖ అధికారులు తిరుకుమరన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుష్ప సోయగం

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో మంచు కురుస్తున్న తరుణంలో, గొడుగులు చేతబట్టి బ్రయాంట్ పార్క్‌లోని పూల అందాలు వీక్షిస్తూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. రాష్ట్రంలో ఎండలు భగ్గుమంటున్న నేపథ్యంలో, సేదతీరేందుకు ప్రజలు చల్లటి ప్రదేశాలకు వెళుతున్నారు. ఈ క్రమంలో, ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వాతావరణం చల్లబడి వర్షం ప్రారంభమైంది. గంట వరకు వర్షం తగ్గకపోవడంతో, అప్పటికే అక్కడకు చేరుకున్న పర్యాటకులు గొడుగులు చేతబట్టి పార్క్ అంతా తిరుగుతూ పూల అందాలు వీక్షించారు.



కొడైకెనాల్‌లో గొడుగులు వేసుకుని వీక్షిస్తున్న పర్యాటకులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో ఘనంగా గురుపూజ

ప్యారీస్, మే 7 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ గురుపూజ ఆరాధన మహోత్సవం బుధవారం ఉదయం 6 గంటలకు ఘనంగా జరిగింది. కొరట్టూరు వాటర్ కెనాల్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో 6.30 గంటలకు అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. ఆశ్రమ ప్రాంగణంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ అర్చకుల బృందం యాగాలు నిర్వహించింది. నగరం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులందరు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు తాతోలు వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, ట్రెజరర్ నూతక్కి కిషోర్, ట్రస్టీ కె.సీతారామశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. స్వామివారు జీవసమాధి అయిన రోజును పురస్కరించుకుని భక్తిగీతాలు ఆలపించి నీరాజనం పలికారు.



యాగం నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

ప్రజా గ్రీవెన్స్‌లో 24 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెపేరిలోని నగర పోలీసు కమిషనర్ అరుణ్ తన కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి 24 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలపై విచారణ జరిపి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

పాఠ్యపుస్తకాలు, విద్యా ఉపకరణాలు సిద్ధం



కోవై గోదాము నుంచి పుస్తకాల తరలింపులో అధికారులు

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి ప్లస్‌టూ విద్యార్థులకు ఉచితంగా అందించనున్న పాఠ్య, నోటు పుస్తకాలు, విద్యా ఉపకరణాలు పాఠశాలలకు తరలించే పనులు ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం జూన్ 2వ తేది నుంచి పాఠశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, పుస్తకాల బ్యాగు, యూనిఫాం, షూస్, సాక్స్, జామెట్రీ బాక్స్ తదితరాలు అందించనున్నారు. ఇప్పటికే జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల్లో భద్రపరిచిన విద్యా సామగ్రిని పాఠశాలలకు తరలించే పనులు ప్రారంభించారు.

కాట్పాడిలో డీఎంకే ఆవిర్భావ వేడుకలు



వేలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలో డీఎంకే ఆవిర్భావ వేడుకలు పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. కాట్పాడిలోని చిత్తూరు బస్టాం డు సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జంక్షన్‌లోని అన్నాదురై విగ్రహానికి కాట్పాడి మండల డీఎంకే నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపి, మండల అధ్యక్షుడు దురైవేలు, కార్యదర్శి ఇళంగోవన్, ఆర్ముగం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించండి

పార్టీ శ్రేణులకు ప్రేమలత పిలుపు



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న ప్రేమలత

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పిలుపునిచ్చారు. కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన పార్టీ సర్వ సభ్య మండలిలలో ఎంపికైన జిల్లాల నేతలు, ప్రముఖులతో సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ప్రేమలత మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనే విషయంపై జనవరిలో జరగనున్న పార్టీ మహానాడులో తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పార్టీయువజన విభాగానికి కొత్తగా ఎంపికైనవారంతా జిల్లా శాఖ నేతలతో సంబంధాలు పెంచుకుని ఆయా నియోజకవర్గాలలో ప్రచార కార్యక్రమాలు ఉధృతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ యువజన విభాగం కార్యదర్శి విజయ్ ప్రభాకరన్, కోశాధికారి ఎల్కే. సుదీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతాద్రిపేటలో చేపల మార్కెట్

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చింతాద్రిపేటలో ఆధునిక వసతులతో నిర్మించిన చేపల మార్కెట్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి తన ఎక్స్‌లో... ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులతో, మన ట్రిప్లికేన్ నియోజకవర్గం చింతాద్రిపేట జ్యోతియమ్మాళ్ నగర్‌లో 'సింగార చెన్నై 2.0' పథకంలో రూ.2.92 కోట్లతో నిర్మించిన ఆధునిక చేపల మార్కెట్‌ను బుధవారం ప్రారంభించాను. ఈ మార్కెట్, మన నియోజకవర్గంలోని చేపల వ్యాపారుల పురోగతికి తోడ్పడుతుందని తెలియజేస్తున్నాను అంటూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పోస్ట్ చేశారు.



మార్కెట్లో చేపలు పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

అందుబాటులోకి నూతన బస్సు సేవలు

తిరుత్తణి, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని తండలం వెళ్లే నూతన బస్సు సేవలను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ మంగళవారం ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బస్సుకు పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తిరువళ్లూరు నుంచి తండలం, సత్రం, ఎగువ నల్లాటూరు, పింజివాక్కం, మనవాలనగర్‌తో పాటు 20 గ్రామాల ప్రజల సౌకర్యార్థం అత్యాధునిక వసతులున్న బస్సును నడుపుతున్నట్టు తెలిపారు.



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్

వ్యవసాయ మార్కెటింగ్ సొసైటీ సహకారంతో ఫ్లోర్ మిల్ ప్రారంభం

తిరుత్తణి, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గ్రామీణ వ్యవసాయ మార్కెటింగ్ సొసైటీ సహకారంతో ఏర్పాటైన ఫ్లోర్ మిల్లులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎస్ చంద్రన్ ప్రారంభించారు. తిరుత్తణి సమీపంలోని వేలంజేరిలో నిర్మితమైన ఈ ఫ్లోర్‌మిల్లులో రాగులు, మిరపకాయలు తదితరాలను పిండిచేసే ఫ్లోర్ యంత్రాలను అమర్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే చంద్రన్ రిబ్బన్ కట్‌చేసి రాగులను మిషన్‌లో వేసి ప్రారంభించారు. వేలంజేరిలో గ్రామీణ వ్యవసాయ మార్కెటింగ్ సొసైటీ సహకారంతో రూ.8 లక్షల విలువైన ఫ్లోర్ మిల్లులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అముద, సహకార శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, రాజామోహన్, మండల డీఎంకే కార్యదర్శి రాజేంద్రన్, సహకార సంఘం గోదాముల మేనేజర్ ఉమాపతి, కార్యదర్శి సంజీవిరాజు, డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫ్లోర్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్ చంద్రన్

చెత్త తొలగించండి

- వేలూరు కార్పొరేషన్ ప్రజల వినతి

వేలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో నాలుగు రోజులుగా చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని వేలూరులోని పాత ప్రభుత్వాస్పత్రి సమీపంలోని స్థానికులు వాపోయారు. చెత్త పేరుకుపోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయన్నారు. పిల్లలను రాత్రి సమయంలో బయటకు పంపించాలంటేనే భయమేస్తోందని వాపోయారు.. దీనిపై బుధవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, మే 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో లైన్లలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నా 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని టీఎస్ఈబీ తెలిపింది.

రామాపురం...

రామాపురం ప్రాంతంలోని వళ్ళువర్ రోడ్డు, భజన కోవెలవీధి, రావిచెట్టు జంక్షన్, ఆనందం నగర్, భారతీరోడ్డు, హౌసింగ్ బోర్డు, శ్రీరామ్‌నాగర్, తమిళ్‌నగర్, గిరినగర్, కురింజినగర్, గంగయమ్మన్ కోవెల్‌వీధి, రత్నా కాంప్లెక్స్ ప్రకాశంవీధి, సెంథమిల్‌నగర్, కోథారినగర్, అంబాల్‌నగర్, అన్నై సత్యానగర్, కేకే పొన్నురంగం సాలై, కలశత్తమ్మన్ ఆలయవీధి, రాయలానగర్, ఎస్ఆర్ఎం తిరుమలైనగర్, కామరాజర్ రోడ్డు, గంగై అవెన్యూ, శాంతినగర్, మౌంట్ పూందమల్లి రోడ్డు, మొగలివాక్కం మెయిన్ రోడ్డు, కమలా నగర్, శుభశ్రీనగర్, గురుహోమ్స్, నెహ్రూనగర్, పొన్నమ్మాల్ నగర్, రాజీవ్ గాంధీనగర్, ఎంకేఎం స్కూల్, వెంకటేశ్వర అవెన్యూ, రామ్‌నగర్, మారియమ్మన్ కోవెల్ వీధి, కృష్ణవేణి నగర్, గురుస్వామినగర్, సీఆర్ఆర్ పురం, ఆర్ముగం నగర్, తిరు నగర్, గణేశ్ నగర్, మనపాక్కం, రామ్మూర్తి అవెన్యూ, ఏవీ మల్లీష్ గార్డెన్, ట్రైమాక్స్, వీవీ కోవెల్ వీధి, పెరుమాళ్‌వీధి, ఏజీఎస్ కాలనీ, మేట్టుకుప్పం, కొలపాక్కం, ఏజీఆర్ గార్డెన్, సెల్వలక్ష్మి గార్డెన్, బృందావవన్ నగర్.

మేలూరు...

మేంజూర్‌నగర్, టీహెచ్ రోడ్డు, తేరడి వీధి, సిరువాక్కం, సూర్యానగర్, బీడీవో కార్యాలయం, వన్నిపాక్కం, సీమావరం, ఆర్ఆర్ పాళయం, అరియన్ వాయల్, పుదిపేడు, నందియంబాక్కం, మేలూరు, పట్టమందిరి, వళ్లూరు, అత్తిపట్టు, ఎస్ఆర్ పాళయం, జీఆర్ పాళయం, కొండక్కై, పల్లిపురం, వళుదిగైమేడు, కరయాన్‌మేడు.

మైలాపూర్....

మైలాపూర్‌లోని శాంథోమ్ హైరోడ్డు, డుమింగ్ కుప్పం, అప్పువీధి, సయ్యద్ వాహన్ హుస్సేన్‌వీధి, ఎన్ఎంకే రోడ్డు, గుడ్‌సెరీరోడ్డు, నుచ్చికుప్పం, సాలై వీధి, ముల్లైమానగర్, శ్రీనివాసపురం, లాజర్ చర్చి రోడ్డు, రోసరీ చర్చి రోడ్డు, ముత్తువీధి, కచ్చేరి రోడ్డు, పాపనాశం రోడ్డు, అబ్రహం వీధి, న్యూస్ట్రీట్, చోళయప్పన్ వీధి, కేశవ పెరుమాళ్ సన్నిధి వీధి, వీసీ గార్డెన్ రోడ్డు, ఆర్‌కే మఠం రోడ్డు, మందవెలి రోడ్డు, వెంకటేశ్ అగ్రహారం, పిచ్చుపిళ్లైవీధి, పశ్చిమ, తూర్పు మాడవీధులు, నల్లప్పన్‌వీధి, ఆదాంవీధి, కుమరగురు వీధి, తిరువళ్లూరు పేట, జ్యోతినగర్.

పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

- రెండ్రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుత్తణి, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు మండలం బొమ్మరాజుపేటలోని దళితవాడలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు వీచాయి. రాత్రి 8 గంటలకు గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడింది. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనతో కరెంటులేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి, బుధవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు పనులు పూర్తిచేశారు.

టీవీకే ఆధ్వర్యంలో అన్నదానం



వేలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం అన్నదానం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, వేలూరు జిల్లా కార్యదర్శి వేల్‌మురుగన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. మణికంఠన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

సంతలో జోరుగా మేకల విక్రయాలు



వేలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సంతమేడులో బుధవారం నిర్వహించిన మేకల సంతలో రూ.95 లక్షల మేరకు విక్రయాలు జరిగాయని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుడియాత్తం, కాట్పాడి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ సంతలో మేకలను కొనుక్కునేందుకు ఉత్సాహం చూపారని ఒక్కో మేక రూ.30 వేల వరకు విక్రయించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి



వేలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం పర్యావరణంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సుబ్బులక్ష్మి మాట్లాడుతూ... పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు పూర్తిమానాలని, ప్రకృతిని సంరక్షించేందుకు గుడ్డసంచులనే వాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ అధికారులు అశోక్‌కుమార్, మణి, మదన్‌కుమార్, వెట్రిసెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

చౌక ధర దుకాణం ప్రారంభం



రేషన్ సరుకులను ప్రజలకు అందిస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో నూతనంగా నిర్మించిన చౌక ధర దుకాణాన్ని బుధవారం ఉదయం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వం ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారాన్ని చూపిస్తోందని, ప్రజా సంక్షేమం కోసం తిరుత్తణిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గతంలోని పాత రేషన్‌దుకాణ భవనం మరమ్మతులకు గురైన కారణంగా ప్రజల అభ్యర్థన మేరకు రూ.12 లక్షల వ్యయంతో నూతన దుకాణ భవనాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మహిళలకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు మండల డీఎంకే కార్యదర్శి సీజే.శ్రీనివాసన్, రిజిస్ట్రార్ బాలాజీ, సహకార సంఘం కార్యదర్శి శశికుమార్, దండపాణి, వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోడ్‌లో భారీ వర్షానికి కూలిన చెట్లు



చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా ఆప్పకూడల్, అత్తాని పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుండి బుధవారం వేకువజాము వరకు ఉరుములు మెరుపులు, పెనుగాలులతో భారీగా వర్షాలు కురిశాయి. దీంతో పలు రహదారుల్లో చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆప్పకూడల్ - అత్తాని రహదారిలో పెనుగాలులకు చెట్లు కూలాయి. తెండ్రల్‌నగర్ రహదారిలో పెనుగాలులకు మరో పెద్ద వృక్షం కూలిపడింది. దీనితో ఆ రెండు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఈ సమాచారం అందుకున్న హై వేస్ అధికా రులు, కార్మికులను, యాంత్రిక రంపాలను వెంటబెట్టుకుని హుటాహుటిన అక్కడికి వెళ్లి చెట్లను తొలగించారు.

ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్, పాలిటెక్నిక్‌లలో

ఆన్‌లైన్ అడ్మిషన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



ఇంజనీరింగ్ దరఖాస్తుల వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవీ చెళియన్ (చిత్రంలో) ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సి.సమయమూర్తి, కళాశాల విద్య కమిషనర్ ఎ.సుందరవల్లి, సాంకేతిక విద్య కమిషనర్ జె.ఇన్నసెంట్ దివ్య, తమిళనాడు ఇంజనీరింగ్ విద్యార్థుల అడ్మిషన్ కార్యదర్శి టి.పురుషోత్తమన్ తదితరులు

పెరంబూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్, పాలిటెక్నిక్‌ల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ఒకే సమయంలో ప్రారంభమైంది. గిండి అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బుధవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో మూడు కళాశాలలకు సంబంధించి దరఖాస్తు సమర్పణకు అధికార వెబ్‌సైట్లను ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవీ చెళియన్ ప్రారంభించారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరగోరు విద్యార్థులు www.tneaonline.orgలో జూన్ 3వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. అలాగే, ఒరిజినల్ సర్టిఫికెట్ల నమోదు జూన్ 9వ తేదిలోపు చేయాల్సి ఉండగా, పరిశీలన జూన్ 10 నుంచి 20వ తేది వరకు కొనసాగనుంది. 27న ర్యాంకుల జాబితా విడుదల చేయనున్నారు. ర్యాంకుల జాబితాలో లోపాలు ఉంటే జూన్ 28 నుంచి జూలై 2వ తేది వరకు సేవా కేంద్రాల ద్వారా తెలియజేయవచ్చు. ఏఐసీటీఈ మార్గదర్శకాలతో కౌన్సిలింగ్ తేది ప్రకటించనున్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు... : రాష్ట్రవ్యాప్తంగా 176 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో 159 కోర్సుల్లో 1,25,345 సీట్లు ఉన్నాయి. కళాశాలల్లో చేరగోరు విద్యార్థులు www.tngasa.comలో ఈ నెల 27వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. పాలిటెక్నిక్‌లలో ఈ ఏడాది 7 కొత్త కోర్సులు పరిచయం చేయడంతో అదనంగా 570 సీట్లు చోటు చేసుకున్నాయి. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.tnpoly.inలో ఈనెల 23వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో నేరుగా చేరగోరే విద్యార్థులు కూడా అదే సమయంలో దరఖాస్తు చేసుకోవాలి.

అట్టహాసంగా డీఎంకే ప్రభుత్వ వార్షికోత్సవాలు

● 214 కొత్త బస్సులను ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో యేట అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ కొత్తగా కొనుగోలు చేసిన 214 లగ్జరీ బస్సులను సీఎం స్టాలిన్ ప్రారంభించారు. స్థానిక ఐలాండ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో పచ్చజెండా ఊపారు. రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థకు 27 లగ్జరీ బస్సులు, విల్లుపురం రవాణా సంస్థకు 114 బస్సులు, సేలం రవాణా సంస్థకు 10 బస్సులు, కోయంబత్తూరు రవాణా సంస్థకు 31 బస్సులు, మదురై రవాణా సంస్థకు 14 బస్సులు, తిరునల్వేలి రవాణా సంస్థకు 18 బస్సులు కేటాయించారు. మహిళల వెలుగుబాట పయనం కోసం 70 సిటీ బస్సులు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు శివశంకర్, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, ఎంపీలు టీఆర్ బాలు, ఎ.రాజా, దయానిధిమారన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, రవాణా శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఫణీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్త బస్సులను పరిశీలించేందుకు వెళ్తూ ఫుట్‌బోర్డుపై నిలిచి చేతులూపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సిటీ బస్సులో సీఎం...

సీఎం స్టాలిన్ బుధవారం ఉదయం సచివాలయం నుంచి కొరట్టూరు అన్నా శత జయంతి స్మారక గ్రంథాలయంలో ఏర్పాటైన సభకు బయలుదేరి వెళుతూ మార్గమధ్యంలో తన కాన్వాయ్‌ని విడిచి అటుగా వెళుతున్న మహిళల వెలుగుబాట పయనం సిటీ బస్సు ఎక్కి ప్రయాణించారు. ఆ సందర్భంగా మహిళా ప్రయాణికులతో మాట్లాడుతూ వెలుగుబాట పయనం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారా అని అడిగారు. ఓ వృద్ధురాలు మాట్లాడుతూ ఉచిత ప్రయాణం వల్ల తనకు ప్రతినెలా వెయ్యి రూపాయలకు పైగా ఆదా అవుతోందని తెలిపారు. బస్సులో తమతోపాటు ప్రయాణించిన సీఎం స్టాలిన్‌ను చూసిన ప్రయాణికులు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. అందరినీ పలకరించిన తర్వాత స్టాలిన్ బస్ దిగి తన కాన్వాయ్‌ని చేరుకుని కొరట్టూరుకు బయలుదేరారు. సీఎం స్టాలిన్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఆ సిటీ బస్సులో ప్రయాణించారు.



నగరంలో 32-బి బస్సులో వెలుగుబాట పయనం ద్వారా ఉచిత ప్రయాణం చేస్తున్న వృద్ధురాలిని పలకరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



'హార్ట్‌బీట్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

జియో హాట్‌స్టార్‌లో 'హార్ట్‌బీట్-2' ప్రోమో

ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న 'హార్ట్‌బీట్-2' వెబ్ సిరీస్ ప్రోమో జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళ ప్రేక్షకుల నుంచి ఆదరణ పొందిన ఈ వెబ్ సిరీస్ రెండో భాగాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించారు. తొలి సీజన్ ఉత్కంఠభరితమైన మలుపులతో ముగిసినప్పటికీ సమాధానం లేని ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. వీటికి సమాధానాలు తెలుసుకోవడానికి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రెండో సీజన్‌లో అనేక కీలకమైన టర్నింగ్ పాయింట్స్, ఉత్కంఠభరితమైన క్షణాలు, భావోద్వేగ సన్నివేశాలు ఉన్నాయి. నిలోఫర్, కిరణ్, కమల్, రోషిణి, డీఎం కార్తిక్, బాలు, అనుమోల్, యోగలక్ష్మి, పాటినికుమార్, శర్వా, శబరీష్, చారుకేష్, రేయా తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఈ రెండో సీజన్‌కు కథను సమకూర్చిన సుందరరాజన్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. రెజిమల్ సూర్య థామస్ సినిమాటోగ్రఫీ అందించగా, శరణ్ రాఘవన్ సంగీతం సమకూర్చారు.

నేటి సినిమాల్లో హాస్యం తగ్గిపోయింది

● హీరో శింబు



సంతానం, శింబు, ఆర్య

ప్రస్తుతం వస్తున్న చిత్రాల్లో హాస్యం బాగా తగ్గిపోయిందని హీరో శింబు అలియాస్ శిలంబరసన్ టీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో తాజాగా జరిగిన ఒక సినీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 'ఒకరికి సాయం చేస్తుంటే ఎలాంటి ప్రతిఫలం ఆశించకండి. మనసులో ఏదో ఆశను దృష్టిలో పెట్టుకుని సాయం చేయొద్దు. మనం చేసే సాయం వల్ల వారు లబ్ధి పొందితే వారిలో కొంత మంది కృతజ్ఞతగా ఉంటారు. మరికొందరు విస్మరిస్తారు. దాన్ని పట్టించుకోవద్దు. అలా.. చేసిన సాయాన్ని ఎన్నటికీ మరిచిపోని నటుడు సంతానం. మేమిద్దరం 'ఎస్‌టీఆర్49'లో కలిసి నటిస్తున్నాం. ప్రస్తుతం వస్తున్న చిత్రాల్లో హాస్యం తగ్గిపోయింది. అనేక సినిమాలు యాక్షన్‌తో నిండి ఉన్నాయి. తాజాగా శశికుమార్ - సిమ్రాన్ నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' చూశా. చాలా బాగుంది. అలాంటి సినిమాలు రావాలంటే సంతానం మళ్లీ కామెడీ పాత్రలు చేయాలి. అందుకే 'ఎస్‌టీఆర్49'లో తీసుకున్నాం. మున్ముందు సంతానాన్ని అనేక చిత్రాల్లో చూస్తారు' అని పేర్కొన్నారు.

వంద రోజుల్లో 'కూలీ'



'కూలీ'లో రజనీకాంత్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ'. ఈ చిత్రంపై నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ మంగళవారం సాయంత్రం అప్‌డేట్ ఇచ్చింది. 'మరో వంద రోజుల్లో కూలీ' అంటూ ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఆగస్టు 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో మే 6వ తేదీ నుంచి ఆగస్టు 14కు సరిగ్గా వంద రోజులు ఉండటంతో... 'మరో 100 రోజుల్లో కూలీ' అంటూ వెల్లడించింది. ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు సత్యరాజ్, అక్కినేని నాగార్జున, శ్రుతిహాసన్, పహద్ ఫాజిల్, రెబా మోనికా జాన్, ఉపేంద్ర తదితరులు నటించారు. అనిరుధ్ సంగీత స్వరాలు సమకూర్చారు. సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ నిర్మిస్తున్నారు.

ప్రియా ఆనంద్ జలకాలాటలు

కోలీవుడ్‌లోని యంగ్ హీరోయిన్లలో ప్రియాఆనంద్ ఒకరు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'సుమో'లో ఆమె హీరో మిర్చి శివ ప్రియురాలి పాత్రలో మురిపించారు. ప్రముఖ నిర్మాత ఐసరి కె.గణేష్ నిర్మించిన ఈ చిత్రంలో జపాన్‌కు చెందిన సుమో వీరుడు యాషినోరి తషిరో కీలక పాత్రను పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. సామాజిక మాధ్యమాల్లో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రియా ఆనంద్... తాజాగా ఈత కొలనులో అందాలను ఆరబోస్తూ కనిపించారు. ఈ వీడియోను ఆమె తన ఇన్‌స్టాఖాతాలో షేర్ చేయగా, అది వైరల్ అయింది. ఈ వీడియోను చూసిన ఆమె అభిమానులు... సో క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తూ, షేర్ చేస్తున్నారు.



అంగరంగ వైభవంగా వాసవీ మాత జయంతి



వాసవీజ్యోతిని స్వాగతిస్తున్న ఎస్‌కేపీడీ చారిటీస్ సభ్యులు

● ఎస్‌కేపీడీలో ప్రత్యేక పూజలు

ప్యారీస్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో వాసవీమాత జయంతి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవాంబ జయంతిని పురస్కరించుని మూడు వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గర్భగుడిలో కొలుదీరిన అమ్మవారికి ఉదయం 6 గంటలకు అభిషేక, అర్చనను ఆలయ అర్చకుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా జగన్మాతను వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. వాసవాంబ జన్మస్థలమైన ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ క్షేత్రం నుంచి వాసవీ జ్యోతితో మంగళవారం ఉదయం చెన్నైకి బయలుదేరిన ఎస్‌కేపీడీ నిర్వాహకులు, బుధవారం ఉదయం 6 గంటలకు చెట్‌పేటలోని ఎస్‌కేపీడీ హాస్టల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి గోవిందప్పనాయకన్ వీధిలో ఉన్న ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాలకు చేరుకుని అక్కడి నుంచి పాదయాత్రగా కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి చేరుకున్నారు. ఎస్‌కేపీడీ ధర్మకర్త, అధ్యక్షుడు కొల్లా వెంకట చంద్రశేఖర్, సీనియర్ ట్రస్టీ ఊటుకూరు శరత్‌కుమార్, ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్‌బాబు, టి.బద్రినాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్ దంపతులు వాసవీజ్యోతిని ఘన స్వాగతించారు. అనంతరం క్షీర కలశాలతో పాదయాత్రగా ఆలయానికి చేరుకుని మహిళలు సమర్పించిన పాలతో అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మూలమంత్ర హోమం, మధ్యాహ్నం దీపారాధన, సాయి రాగమాలికా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తిపాటల సంగీతం, విశేష దీపారాధన తర్వాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నానగర్ ఆర్యవైశ్య సంఘంలో...

అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు ఆదియప్పనాయకన్ వీధిలో ఉన్న 'గోపురం హౌస్'లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు, గోపురం సంస్థల అధినేత వైవీ హరికృష్ణ 108 మంది మహిళలకు పాల బిందెలు అందజేసి ఊరేగింపును ప్రారంభించారు. సంఘ కార్యదర్శులు ఎం.కాశీవిశ్వనాథం, ఎస్.వి.ప్రసాదరావు, ట్రెజరర్ ఎ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పీజేపీఎన్ గుప్తా, వీఎన్ హరినాథ్ తదితరులతో సాగిన ఈ ఊరేగింపు జై వాసవాంబ! జైజై వాసవాంబ!! భక్తుల జయజయ ధ్వనాలు మంగళవాయిద్యాలతో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకుంది. అక్కడ అమ్మవారికి క్షీరాభిషేకం, అలంకారం, హారతి పూజలు నిర్వహించి ముత్తైదువులకు పసుపు కుంకుమలను ప్రసాదంగా పంపిణీ చేశారు.

సదరన్ ఇండియా వైశ్య సంఘంలో...

స్థానిక గిడ్డంగివీధిలోని సదరన్ ఇండియా వైశ్య సంఘం (శివ) ఆధ్వర్యంలో వాసవి జయంతి సందర్భంగా బుధవారం ఉదయం సంఘ ప్రాంగణంలో లోకకల్యాణార్థం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో అమ్మవారిని కొలువుదీర్చి పాల బిందెలతో నిర్వహించిన ఊరేగింపులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అధ్యక్షులు అంజతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, కోశాధికారి పెసల రమేష్‌తో పాటు సీనియర్ సభ్యులు పాదయాత్రగా ఎస్‌కేపీడీ ప్రాంగణానికి చేరుకుని క్షీరాభిషేకంలో పాల్గొని వాసవీమాతను భక్తిశ్రద్ధలతో సేవించారు.



పల్లకీ మోస్తున్న శివ నిర్వాహకులు



పాల బిందెల ఊరేగింపులో గోపురం కుంకుమ అధినేత వైవీ హరికృష్ణ, సంఘ నిర్వాహకులు

కనుల పండువగా మీనాక్షి అమ్మవారి పట్టాభిషేక మహోత్సవం

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): మదురై నగరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం మీనాక్షి అమ్మవారి ఆలయంలో చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి పట్టాభిషేక మహోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం వేకువజాము నుంచి మదురై నగరంలో మీనాక్షి అమ్మవారి ఏలుబడిలోకి వచ్చిందని, మహాసామ్రాజ్ఞిగా అమ్మవారు పట్టాభిషిక్తురాలైందని ఆలయ నిర్వాహకులు సంప్రదాయిక రీతిలో గంటలు, డంకా మోగించి ప్రకటించారు. ఈ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ఏప్రిల్ 29న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మరుసటి రోజు నుంచి మీనాక్షి సుందరేశ్వరర్ వివిధ వాహనాల్లో నాలుగు మాసి వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాల్లో ఏడో రోజైన మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లు నందికేశ్వరుల వాహనంపై ఆశీనులై మాసి వీధుల్లో ఊరేగారు. సాయంత్రం యాళి వాహనంలో స్వామిఅమ్మవార్లు ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఆ తర్వాత చిత్తిరై ఉత్సవాల్లో ప్రధానోత్సవమైన మీనాక్షి అమ్మవారి పట్టాభిషేక మహోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయంలోని అమ్మవారి సన్నిధికి ఎదురుగా ఉన్న ఆరు కాళ్ల మండలంలో మీనాక్షి అమ్మవారికి పట్టాభిషేకం జరిపారు. ఆ సందర్భంగా అమ్మవారికి రాయర్ కిరీటాన్ని ధరింపజేశారు. నవరత్నఖచిత రాజదండాన్ని (సెంగోల్‌ను) అమ్మవారికి అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు, శైవపండితులు పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా అమ్మవారిని కీర్తించే శ్లోకాలను పఠించారు. అటు పిమ్మట అమ్మవారి హస్తంలోని రాజదండాన్ని ఆమె ప్రతినిధిగా ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు రుక్మిణీ పళనివేల్‌రాజన్‌కు అందజేశారు. ఆ రాజదండాన్ని స్వామివారి సన్నిధి రెండో ప్రాకారం అంతటా ఊరేగింపుగా తీసుకెళ్లి మళ్లీ మీనాక్షి అమ్మవారికి అప్పగించారు. ఆ తర్వాత మీనాక్షి అమ్మవారు మదురై నగర సామ్రాజ్ఞిగా రజత సింహాసనంపై ఆశీనులై మాసి వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. సుందరేశ్వరర్ కూడా మరో రజత సింహాసనంపై ఆశీనులై అమ్మవారి వెంట నడిచారు. మదురై నగర సామ్రాజ్ఞి అలంకారంతో రాయర్ కిరీటాన్ని ధరించి, చేత సెంగోల్ పట్టుకుని ఊరేగుతున్న మీనాక్షి అమ్మవారిని దర్శించి భక్తులంతా పరవశించిపోయారు. బుధవారం వేకువజాము ఆలయాన్ని తెరిచి నిత్యపూజాది కార్యక్రమాలను నిర్వహించిన మీదట ఆలయ నిర్వాహకులు మదురై నగరంలో మళ్లీ మీనాక్షి అమ్మవారి ఏలుబడిలోకి వచ్చిందని, ఆమె ఆజ్ఞలను భక్తులంతా శిరసావహించాలని ప్రకటనలు జారీ చేశారు. మీనాక్షి అమ్మవారి పట్టాభిషేకమహోత్సవం అత్యంత వైభవంగా ముగియడంతో అమ్మవారి తిరుకళ్యాణోత్సవం, రథోత్సవం తదితర వేడుకలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు.



మీనాక్షి అమ్మవారికి కిరీటధారణ చేస్తున్న ప్రధానార్చకులు



నందీశ్వరుడిపై ఊరేగుతున్న మీనాక్షి, సుందరేశ్వరర్‌స్వామి

రష్యా వర్శిటీల్లో భారతీయ విద్యార్థులకు 10వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లు

ప్యారీస్, మే 7 (ఆంధ్రజ్యోతి): రష్యా వర్శిటీల్లో రానున్న విద్యాసంవత్సరంలో భారతీయ విద్యార్థులకు 10వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లను కేటాయించినట్లు చెన్నై రష్యా కల్చరల్ సెంటర్ డైరెక్టర్, ఉపరాయబారి అలెగ్జాండర్ డోడోనవ్ పేర్కొన్నారు. స్థానిక మైలాపూర్‌లోని రష్యన్ కల్చరల్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇండియన్ నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు పాటిస్తున్న రష్యాలోని విశ్వవిద్యాలయాల్లో చేరుతున్న, చదువుకుంటున్న పలు దేశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపకార వేతనంతో పాటు, నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది రష్యాలో వైద్యవిద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 200 శాతం పెరిగిందన్నారు. 2025- 26వ విద్యాసంవత్సరానికి సంబంధించి మెడికల్ కోర్సుల్లో చేరదలుచుకున్న భారతీయ విద్యార్థుల కోసం ఈనెల 10, 11 తేదీల్లో చెన్నైలో, 13న కోవైలో, 14న సేలంలో, 15న తిరుచ్చిలో, 16న మదురైలో రష్యా ఎడ్యుకేషన్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 200 మంది భారతీయ విద్యార్థులకు 100శాతం విద్యాఉపకార వేతనంతో వైద్య విద్యా కోర్సులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నీట్‌లో ఉత్తీర్ణత సాధించి ప్లస్‌టూలో 50శాతం మార్కులు సాధించిన భారతీయ విద్యార్థులు, 40శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ విద్యార్థులకు ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ కోర్సులకు తమ దేశంలోవున్న యూనివర్శిటీల్లో చేరేందుకు దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా ప్రదర్శనకు సంబంధించిన బ్రోచర్‌ను దక్షిణ భారత రష్యా ఉపరాయబారి వాలెరీ కొజేవ్, స్టడీ అబ్రాడ్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రవిచంద్రన్, డాక్టర్ ఎలీనా సర్బుల్ స్టేవాతో కలిసి అలెగ్జాండర్ డోడోనవ్ ఆవిష్కరించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రష్యా కల్చరల్ సెంటర్ డైరెక్టర్ అలెగ్జాండర్ డోడోనవ్

వైభవంగా బృహదీశ్వరుడి మహా రథోత్సవం

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): తంజావూరు బృహదీశ్వరాలయంలో చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం నిర్వహించిన మహారథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని లాగారు. సర్వాలంకరణలతో త్యాగరాజస్వామి, కమలాంబాళ్ రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులైన భక్తులను అనుగ్రహించారు. ఈ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ఏప్రిల్ 23న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం త్యాగరాజస్వామి వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఈ 15వ రోజైన బుధవారం ఉదయం రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని వేకుజాము 5 గంటలకే తెరిచారు. త్యాగరాజస్వామి, స్కంధర్, కమలాంబాళ్ ఊరేగింపు, ముత్యాల అలంకరణతో కూడిన సప్పరంలో పంచమూర్తుల ఊరేగింపు జరిగాయి. ఆ తర్వాత స్వామిఅమ్మవారు రథంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. తొలుత వినాయకుడు, సుబ్రమణ్యస్వామివారి సప్పరాలు బయలుదేరాయి. వాటి వెనుకే త్యాగరాజస్వామి, కమలాంబాళ్ కొలువుదీరిన మహారథం బయలుదేరింది. మహారథం వెనుక నీలోత్పలాంబాళ్, చండికేశ్వరర్ సప్పరాలు వెళ్లాయి. మహారథానికి ముందు శైవ భక్తులు వాయిద్యాలను మోగిస్తుండగా, భక్తులంతా 'త్యాగీశా' అంటూ నినాదాలు చేస్తూ మోకుతాళ్లను పట్టుకుని లాగారు. ఆ రథం ప్రధాన వీధుల్లో వెళుతుండగా భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ పి. ప్రియంకా పంకజం, జిల్లా ఎస్పీ ఆర్ రాజారామ్, మేయర్ సన్ రామనాథన్, డిప్యూటీ మేయర్ అంజుగం భూపతి, కార్పొరేషన్ కమిషనర్ కె.కన్నన్, తంజావూరు దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ సి.బాబాజీ రాజా భోంస్లే తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ రథం సందుమారియమ్మన్ ఆలయం, కొంకణేశ్వర ఆలయం, మూలై ఆంజనేయస్వామి ఆలయం, ఉత్తరవీధి వినాయకుడి గుడి, రత్నపురీశ్వరర్ ఆలయం, గురుకుల సంజీవి ఆలయం, తూర్పువీధిలో కొడిమరత్తు మూలై, విఠోబా ఆలయం, మణికర్ణికేశ్వర ఆలయం, వరదరాజపెరుమాళ్ ఆలయం, దక్షిణ వీధిలో కలియుగ వెంకటేశ్వరాలయం, కెనరాబ్యాంక్ పిళ్ళయార్ కోవిల్, కాశీవిశ్వనాధర్ ఆలయం, కాళియమ్మాళ్ ఆలయం తదితర ప్రాంతాల్లో ఐదునిమిషాలపాటు నిలవటంతో, ఆయా ఆలయాల తరపున ప్రధానార్చకులు కర్పూరనీరాజనాలు సమర్పించారు.



తంజావూరు దక్షిణ వీధిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోనేటిరాయుడి కల్యాణ వేడుక





పద్మావతి పరిణయోత్సవాల్లో రెండో రోజైన బుధవారం నారాయణగిరి ఉద్యానవనంలోని వేదికపై శ్రీదేవి భూ సమేత శ్రీనివాసుడిని కొలువుదీర్చి కల్యాణ సంబరాన్ని నిర్వహించారు. సాయంత్రం మలయప్పస్వామి అశ్వవాహనాన్ని అధిరోహించి సకల సార్వభౌమాధికార లాంఛనాలతో బయలుదేరి పరిణయోత్సవ మండపానికి వచ్చారు. వెంట స్వర్ణపల్లకిలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. తొలిరోజు తరహాలోనే ఉత్సవర్లకు ఎదుర్కోలు, పూలమాలలు మార్చడం, పూలబంతులాట, నూతన వస్త్రధారణ తదితర కార్యక్రమాలు పూర్తయ్యాక కొలువు నిర్వహించారు. శ్రీవారు దేవేరులతో కలిసి తిరుచ్చిలో ఊరేగుతూ రాత్రి 8.30 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో పోలీసుల మాక్ డ్రిల్

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర' నేపథ్యంలో బుధవారం తిరుపతిలో పోలీసు బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యాన అన్నమయ్య సర్కిల్ రోడ్డులో రిజర్వు పోలీసు బలగాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. ఉగ్రవాదులు అనుకోని సంఘటనలకు పాల్పడినా వారి నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఉగ్రవాదులు దాడులకు వచ్చిన సమయంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం.. లైట్లు ఆపేయడం చేయాలని డీఎస్పీ సూచించారు.



తిరుపతిలో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

బస్సెక్కుతున్న మహిళను నెట్టి..

బంగారు గాజులు కొట్టేశారు

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బస్సెక్కుతున్న 70 ఏళ్ల వృద్ధురాలిని నెట్టి చేతి గాజులు కొట్టేశారు. బుధవారం రాంభగీచ అతిథి గృహం బస్టాండు వద్ద రద్దీలో ఈ చోరీ జరిగింది. బాపట్ల జిల్లాలోని తుమ్మినేని గ్రామానికి చెందిన రవికుమార్ తల్లి లక్ష్మిని ముగ్గురు వెనుక నుంచి నెట్టడంతో ఆమె మెట్లమీద పడిపోయింది. వెంటనే ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు లాక్కుని పరుగుతీశారు. 50 గ్రాముల గాజులు చోరీ అయినట్టు రవికుమార్ తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా దుండగలను గుర్తించిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

కారు ఢీకొని ఏఆర్ కానిస్టేబుల్ మృతి



ఢిల్లీ బాబు(ఫైల్ ఫొటో)

వడమాలపేట, మే 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం కదిరిమంగళం బైపాస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ ఢిల్లీబాబు (46) మృతిచెందారు. నాగలాపురం మండలం వినోబానగర్‌కు చెందిన ఈయన మంగళవారం రాత్రి తిరుపతిలో విధులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వడమాలపేట మీదుగా వెళ్లడానికి కదిరిమంగళం వద్ద రోడ్డు దాటుతుండగా వెంకటగిరికి చెందిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను తిరుపతి రుయాస్పత్రికి తరలించగా.. శ్వాస సమస్య ఏర్పడడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు.

ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

- రుయా సూపరింటెండెంట్ కూడా





బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఎస్వీఎంసీ.. రుయాస్పత్రి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని రవిప్రభు చెప్పగా.. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూస్తానని రాధ పేర్కొన్నారు.

ఏటీఎం చోరులకు రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం తిరుపతి బాలాజీ కాలనీలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ దొరికిన ముగ్గురిలో ఒకరిని సబ్‌జైలుకు.. మరో ఇద్దరిని జువైనల్ హోంకు తరలించారు. వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా గురుఆయర్, చెన్నై అన్నానగర్‌కు చెందిన ఇద్దరు బాలురతో కలిసి అన్నానగర్‌కు చెందిన ముత్తు పాండ్యన్ ఈనెల 3వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇనుప రాడ్‌తో పీఎన్‌బీ ఏటీఎం పగులకొట్టడానికి ప్రయత్నించాడు. అక్కడి సీసీ కెమెరాల ద్వారా ముంబైలో ఉన్న బ్యాంకు కమాండ్ కంట్రోలు యూనిట్ సిబ్బంది గమనించి వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లోకేష్ బాబు సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు మైనర్లు కావడంతో జువైనల్ హోంకు.. ముత్తుపాండ్యన్‌ను రిమాండ్‌కు తరలించారు.

సదరన్ డిస్కం డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ



అయూబ్ ఖాన్, గురవయ్యను అభినందిస్తున్న సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్) మే7(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కం డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, గురవయ్య బుధవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. వీరిని సీఎండీ కె.సంతోషరావు అభినందించారు. అధికారులు, జీఎంలు,ఈఈలు శుభాకాంక్షలు తెలిపారు.

18నుంచి చిత్తూరు ప్రీమియర్ లీగ్

తిరుపతి(క్రీడలు), మే 7(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్, ఏపీఎల్ తరహాలో క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఈనెల 18వ తేదీ నుంచి పది రోజుల పాటు చిత్తూరు ప్రీమియర్ లీగ్(సీపీఎల్)మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రికెట్ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 11న బిడ్డింగ్ ఏర్పాటు చేస్తామని, ఐపీఎల్ తరహాలో క్రీడాకారులను ఆయా స్పాన్సర్లు కొనుగోలు చేస్తారన్నారు. ఎస్వీయూ క్రీడా మైదానంలో ఈ నెల 18న పోటీలు మొదలవుతాయని, రోజుకు రెండు మ్యాచ్‌లు ఉంటాయని వివరించారు. 6 కెమెరాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. 17 నుంచి 35 ఏళ్ల వారికే అవకాశమన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు గిరిబాబు, శ్రీనివాసమూర్తి, సతీష్‌యాదవ్, శ్రీధర్‌కుమార్, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

తిరుపతి(ఆటోనగర్), మే7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం యశోదా నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఈ పోస్టర్లను బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆవిష్కరించారు. పాతికేళ్ల తర్వాత తిరుపతిలో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలు, పరిష్కారంపై చర్చ జరుగుతుందన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, మాధవ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పిడుగుపాటుకు ఇద్దరు గిరిజనుల మృతి



మురళి - శంకర్

శ్రీకాళహస్తి, మే 7(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్టీకాలనీలో బుధవారం వెలుగు చూసింది. ఎస్టీకాలనీకి చెందిన బావ బామ్మర్ది అయిన మురళి(50), శంకర్(36) వ్యవసాయ కూలీలు. చేపల వేటపైనా జీవనం సాగిస్తుంటారు. మంగళవారం కూలి పనుల కోసం వెళ్లిన వీరు రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఈ క్రమంలో ఎస్టీకాలనీ సమీపంలోని పంట పొలాల్లో మురళి, శంకర్ విగతజీవులుగా పడి ఉండగా గుర్తించారు. మంగళవారం సాయంత్రం పిడుగుపాటుతో వీరిద్దరు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావించి మృతదేహాలను ఇంటికి తరలించారు. బుధవారం సమాచారం తెలుసుకున్న వీఆర్వో శ్రావణ్ ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, రూరల్ సీఐ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలకు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. మురళికి భార్య, ఇద్దరు కుమారులు.. శంకర్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుకు బంధువులైన ఇద్దరు గిరిజనులు మృతి చెందడంతో ఎస్టీకాలనీలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఊరందూరు ఎస్టీకాలనీకి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



మురళి, శంకర్ మృతదేహాలు

గాలివాన బీభత్సం

- రాలిన మామిడి, మిరప



బీఎన్‌కండ్రిగలో వర్షానికి తడిసిన మిరప కాయలను ఆరబెడుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగ మండలంలో మంగళవారం రాత్రి గాలి,వాన బీభత్సం సృష్టించింది. మామిడి, మిరప రైతులకు భారీ నష్టం జరిగింది. 200 ఎకరాలలో మామిడి.. 20 ఎకరాలలోని మిరపపంట దెబ్బతింది. తడిసిపోయిన మిరపకాయలను రైతులు బుధవారం ఆరబెట్టుకున్నారు. అనేక గ్రామాలలో చెట్లు నేల కూలాయి. బీఎన్ కండ్రిగలో గాలి వానకు వినాయకమ్మ బొమ్మల షెడ్డు కూలి పోయింది. ట్రాన్స్‌కోకు రూ.3లక్షలకు పైగా తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలగా.. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకు ఒరిగాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడగా, బుధవారం డిస్కం అధికారులు సరఫరా పునరుద్ధరణ చేపట్టారు.

తిరుమలలో పెట్రోలు బంకు లీజులోనూ అవినీతి

- వైసీపీ నేతల కోసం అప్పటి అధికారుల మాయ • భానుప్రకాష్‌రెడ్డి ఆరోపణ

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమలను అంగుళం అంగుళం అమ్మే ప్రయత్నం చేశారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. తిరుమల ఆలయం ముందు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు తిరుమలలో జరిగిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. 2022 ఏప్రిల్‌లో చేసుకున్న ఒప్పందం ప్రకారం తిరుమలలో నడుస్తున్న ఐఓసీఎల్ పెట్రోల్ బంక్ నెలకు దాదాపు రూ.4 లక్షల వరకు టీటీడీకి అద్దె చెల్లిస్తుండగా, అదే ఏడాది మేలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌కు మాత్రం అదే తిరుమలలో నెలకు రూ.2.20 లక్షలకే కేటాయించారని తెలిపారు. ఐఓసీఎల్‌కి ఏడాదికి 3శాతం అద్దె పెంపు నిర్ణయం ఉండగా, హెచ్‌పీసీఎల్‌కు అద్దె పెంపు లేకుండానే 15 ఏళ్లకు లీజుకు ఇచ్చేశారని వివరించారు. అప్పటి వైసీపీ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ వ్యవహారంలో నెలకు దాదాపు రూ.25 లక్షలు చేతులు మారాయని ఆరోపించారు. స్వామి ఆదాయానికి గండి కొట్టిన ఈ అనుమతులను రద్దు చేయాలని బోర్డులో ప్రస్తవిస్తామన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలనేది తన డిమాండ్ అన్నారు.





జాతరలో అశేష జనవాహిని - నిమజ్జనానికి తరలివెళుతున్న పోలేరమ్మ

వైభవంగా పోలేరమ్మ జాతర

నాయుడుపేట/టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తి పడమటి వీధిలోని కుమ్మరి ఇంటి నుంచి బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, భక్తుల నృత్యాల నడుమ బయలుదేరి శెట్టిపల్లివారి వీధిలోని అలంకరణ గుడికి బుధవారం వేకువజామున చేరుకుంది. అక్కడ నిశ్చయతాంబూలం అనంతరం బేరిపేట నుంచి వచ్చిన సప్పరంపై పోలేరమ్మ కొలువుతీరాక గ్రామోత్సవం నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చలువ పందిరిలో పోలేరమ్మను కొలువుతీర్చారు. అమ్మవారి ఎదుట భక్తులు కుంభాలు పోసి పూజలు చేశారు. విన్నమాల గ్రామస్థులు పొలికూడు చల్లారు. అనంతరం అమ్మవారి మెట్టినిల్లైన పాత పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడినుంచి సప్పరంపై అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగింపుగా రాజగోపాలపురానికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 12మందిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘం కొత్త కార్యవర్గం

తిరుపతి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ కె.లక్ష్మీకవిత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎస్.వినోద్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఏవీఎన్ శివకుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జడ్.నవీన్, సెంట్రల్ అసోసియేట్ నామినీగా డాక్టర్ వి.అశోక్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కె.సుధాకర్‌గౌడ్, డాక్టర్ కె.కుమార్, డాక్టర్ డబ్ల్యూ. దీప్తిస్వప్నలత ఎన్నికయ్యారు. వీరు రెండేళ్లపాటు కొనసాగుతారు.

ఆర్‌డీఎస్ఎస్ పనులను సకాలంలో పూర్తి చేయండి

తిరుపతి(ఆటోనగర్), మే7(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజరు అశోక్ రాథోడ్ ఆదేశించారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దళవాయిపల్లి గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సదరన్ డిస్కం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఐదు జిల్లాల్లో జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. ఈ సమావేశంలో సీఎండీ కె.సంతోషరావు, డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్, సీజీఎం రమణాదేవి, జీఎం శ్రీనివాస్, ఈఈ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అశోక్ రాథోడ్

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి చేయండి

తిరుపతి(కలెక్టరేట్),మే7(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని కలెక్టర్, స్మార్ట్‌సిటీ చైర్మన్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. సెంటర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేశామని, అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని గడువు లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'మన పల్లె జానపదం జాతర'

తిరుపతి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్ర, శనివారాల్లో 'మన పల్లె జానపదం జాతర' నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఎస్వీయూ సెనేట్ హాల్లో ఏర్పాట్లు చేశారు. ప్రజా కళావేదిక, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే 300 మంది ప్రతినిధులు పేర్లు నమోదు చేసుకున్నారని, ప్రారంభ, ముగింపు సభలకు ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పాల్గొననున్నారని ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్, ఎస్వీయూ సాంస్కృతిక సమన్వయకర్త డాక్టర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

శ్రీసిటీలో నేడు మంత్రి లోకేశ్‌చే

ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ గురువారం శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు. సత్యవేడులో బుధవారం సాయంత్రం కార్యకర్తలతో సమావేశమైన ఆయన అక్కడే రాత్రి బస చేశారు. గురువారం ఉదయం శ్రీసిటీ చేరుకుని ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. రూ.5001 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ప్లాంట్ నెలకొల్పి 1495 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మరో రూ.839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లు నెలకొల్పుతామని ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. ఎల్జీ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్ వారితో చర్చించారు. శ్రీసిటీలో ఆ సంస్థకు 450 ఎకరాల కేటాయింపు, పలు రాయితీలు, మినహాయింపులను ప్రకటిస్తూ గతేడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరిలో మొదలు కావాల్సిన ప్లాంట్ పనులు.. వివిధ కారణాలతో ఆలస్యమైంది. వాస్తవానికి ఎల్జీ పరిశ్రమకు గురువారం సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయాల్సి ఉండగా, బిజీ షెడ్యూలు కారణంగా ఆయన పర్యటన మారింది. దీంతో ఐటీ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు.

అనుమతుల్లేని దుకాణం తొలగింపు

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కర్ణాటక సత్రాల్లో ఓ దుకాణాన్ని టీటీడీ రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. అనుమతులు లేకుండా దీనిని ఏర్పాటు చేశారంటూ సోషల్ మీడియాలో రావడంతో ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈక్రమంలో టీటీడీ ఎస్టేట్ విభాగం ఏఈవో, సర్వేయర్, ఆర్ఐ బృందం బుధవారం ఆ దుకాణాన్ని తొలగించారు. దుకాణ సామగ్రిని ట్రాక్టర్‌లో తరలించారు. అనుమతులు ఉంటేనే దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని, కర్ణాటక సత్రాల అనుమతి ఉంటే సరిపోదని హెచ్చరించారు.

'అల్లూరి'కి ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా నాటి బ్రిటీష్ పాలకులను ఎదురించి పోరాడిన అల్లూరి సీతారామరాజు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సెట్విన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేసీ శుభం బన్సల్, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజుకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

స్విమ్స్‌లో ఆరుగురు జీబీ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తులు

తిరుపతి(వైద్యం), మే 7(ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన జీబీ సిండ్రోమ్ (గులైన్-బరీ సిండ్రోమ్) వ్యాధితో స్విమ్స్ న్యూరాలజీ విభాగంలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. వీరికి ప్రత్యేక వార్డులో వైద్యం అందిస్తున్నామని, ఎలాంటి ప్రాణాపాయమూ లేదని, ఏబీ పాజిటివ్ రక్తం ఎక్కించాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఈ గ్రూపు రక్తం స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో అందుబాటులో లేదని, దాతలు ముందుకు రావాలని కోరారు. కండరాల బలహీనత, తిమ్మిర్లు, శ్వాసకోశ సమస్యలు, కంటి కదలికల్లో ఇబ్బందులుంటే అవి జీబీ వైరస్ లక్షణాలు కావచ్చని, అలాంటి వారు వైద్యులను సంప్రదించాలన్నారు.

దొంగను పట్టిచ్చిన ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లోకి చొరబడుతున్న దొంగను లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ కెమెరా పట్టిచ్చింది. గొల్లవానిగుంటలో కాపురమున్న ఒక కుటుంబం సెలవులు కావడంతో బయటకు వెళ్లారు. నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించిన దొంగ ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి తాళాలు పగులకొట్టి చోరీకి యత్నించాడు. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన లాక్డ్‌హౌస్ మానటరింగ్ కెమెరా ద్వారా ఈ విషయాన్ని గుర్తించిన కమాండ్ కంట్రోలు సిబ్బంది వెంటనే అలిపిరి పోలీసులను అప్రమత్తం చేశారు. హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి చోరీకి పాల్పడుతున్న దొంగను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్‌బాబు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి



మృతి చెందిన తిరుపతి

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం స్థానిక కొరమేనుగుంటలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... నెల్లూరు గాంధీజీ కాలనీకి చెందిన 20 మంది జాతరలో భిక్షాటన చేసేందుకు రెండు రోజుల క్రితం తిరుపతికి వచ్చారు. కొరమేనుగుంట పోస్టల్ కాలనీలో ఉంటున్నారు. వీరిలో తిరుపతి(20) జాతర వేషం కోసం ఇంటి వద్ద వేప చెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా పైనున్న తీగలు తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. తోటి స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని రుయాకు తరలించి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ తీగలతో వేటకు పాల్పడితే కఠిన చర్యలు

ఎర్రావారిపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగెలతో అటవీ జంతువులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ ట్రాన్స్‌కో ఈఈ చిన్న రెడ్డెప్ప అన్నారు. నెరబైలు సబ్ స్టేషన్‌లో బుధవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పరిధి కావడంతో నిరంతర కాపలా కష్టమైన పని అన్నారు. ఈఅటవీ ప్రాంతంలో కొంతమంది కరెంట్ తీగలతో వన్య ప్రాణుల వేటకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారముందన్నారు. పొలాల వద్ద అనుమానాస్పదంగా వేటకు తిరుగాడే వ్యక్తుల వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో చిన్నగొట్టిగల్లు ఈఈ రమేష్ బాబు ,ఎర్రావారిపాలెం ఎఈ జ్యోతిప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డీపీటీవో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆర్టీసీ), మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా వెంకటరావు గురువారం ఉదయం 11గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై ప్రజా రవాణా వ్యవహారాలపై చర్చించనున్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు 301 మంది గైర్హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాత పరీక్షలకు 610 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 610మంది హాజరయ్యారని, 301మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.